# జీతాల చెల్లింపునకు


Mohan Teachers groups 1 to 10.

# కొత్త విధానం

## అమలులోకి వచ్చిన
## హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్..

డీడీవోలతో పనిలేకుండానే ఉద్యోగుల
బ్యాంకు ఖాతాల్లో జీతాలు జమ

ఎంతో మంచి విధానమంటూ
ఆనందం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ వర్గాలు



గుంటూరు, మార్చి 16 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు చెల్లించే విధానంలో వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు ఉన్న విధానం స్థానంలో కొత్త విధానాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ అమలులోకి తీసుకువచ్చింది. ఈ నెల నుంచి కొన్ని ప్రభుత్వ శాఖల్లో అమలు చేస్తున్న ఈ విధానాన్ని కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి అన్ని విభాగాల్లోనూ అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్' అనే విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఈ విధానం వల్ల కాగితాలతో పనిలేకుండా ఉద్యోగుల జీతాలు నేరుగా రిజర్వ్ బ్యాంకు నుంచి ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా ఏర్పాట్లు చేసింది. దీనివల్ల గతంలో మాదిరిగా ట్రెజరీ అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండదు. ఈ కొత్త విధానం ఎంతో పారదర్శకంగా ఉండటడతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీతాలు, ఇతర అలవెన్సులు, ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారాలు నేరుగా అందించేలా ఈ సరికొత్త విధానానికి రూపకల్పన చేశారు. ఈ విధానం వల్ల రానున్న కాలంలో తమకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని ఉద్యోగ వర్గాలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఇందుకు సంబంధించిన విధి విధానాలను ఆర్థిక శాఖ ఇప్పటికే రూపకల్పన చేసి రాష్ట్రంలోని అన్ని ఖజానా శాఖలకు పంపింది. దీనిని ఈ నెలలో జీతాలు చెల్లించడానికి కొన్ని శాఖల్లో అమలు చేస్తున్నారు. రానున్న కాలంలో 010 ఖాతా ద్వారా ప్రభుత్వం ద్వారా జీతాలు పొందుతున్న అన్ని శాఖలకు చెందిన ఉద్యోగులకు అమలు చేయడానికి ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉద్యోగులకు ఎంతో సౌకర్యవంతంగా ఉండే ఈ విధానం గురించి ఈ వారం 'ఉద్యోగ పర్వం'లో తెలుసుకుందాం..

# జీతాల చెల్లింపులో మార్పులు

గత పదేళ్ల కాలంలో ఉద్యోగుల జీతాల చెల్లింపులో రకరకాల మార్పులు చోటుచేసుకున్నాయి. ఆరంభంలో ఉద్యోగులు తమ జీతాల బిల్లులను తామే తయారు చేసుకుని మండల కార్యాలయాలకు సమర్పిస్తే, వారు పరిశీలించి.. ఆమోదించి ట్రెజరీ కార్యాలయాలకు పంపేవారు. ఆ తర్వాత కార్యాలయాల ద్వారా జీతాలు చెల్లించే విధానం అమలులోకి వచ్చింది. గత కొంతకాలంగా ఉద్యోగులకు ఎటువంటి సంబంధం లేకుండా వారి జీతాలను సర్వీసు రిజిస్టర్ల ఆధారంగా పరిశీలించి మండల విద్యాశాఖాధికారులు నేరుగా తయారుచేసి ట్రెజరీ కార్యాలయాలకు పంపించేవారు. ఉద్యోగులకు రావాల్సిన ఎరియర్స్, ఇంక్రిమెంట్లు తదితర పరిహారాలన్నీ వారే చూసేవారు. ఉద్యోగులకు ఎంతో మేర బిల్లులు చెల్లిస్తున్నారన్న రికార్డులన్నీ మండల విద్యాశాఖాధికారుల వద్ద మాత్రమే ఉండేవి. అందిన జీతాలకు ఉద్యోగుల నుంచి ఎక్విటెన్సు కూడా తీసుకునే అవకాశం ఉండేది కాదు. దీని తర్వాత జీతాలు చెల్లించే విధానంలో కొంత మార్పు చెందింది. ఉద్యోగులకు జీతాలను చెల్లించే అధికారం ఉన్న డ్రాయింగు అండ్ డిస్బర్సింగ్ అధికారు (డీడీవో)లు జీతాల బిల్లులను తయారు చేసి ఆమోదం పొందే పరిస్థితి ఉండేది.

అంటే వీరు తమ పరిధిలో.. తమకింద పనిచేసే ఉద్యోగులకు సంబంధించిన జీతాలను ప్రతినెలా 20వ తేదీలోగా తయారుచేసి ట్రెజరీ కార్యాలయానికి అందించాలి. ట్రెజరీ అధికారులు పరిశీలించి ఆ మరుసటి నెల మొదటి తేదీన జీతాలను ఉద్యోగుల బ్యాంకు ఖాతాలలోజమ చేసేవారు. ఈ విధానంమే ఇప్పటి వరకు అమలులో ఉంది. తాజాగా దీనిని సీఎఫ్ఎంఎస్ విధానంలో జీతాలు తయారు చేయడంగా పిలుస్తున్నారు. ఉద్యోగులకు సంబంధించి మాన్యువల్ విధానంలో ఉన్న సర్వీసు రిజిస్టర్లను చూసి జీతాల బిల్లులను తయారుచేసి సీఎఫ్ఎంఎస్‌కు అప్‌లోడ్ చేస్తున్నారు. వీటిని ఆయా పరిధుల్లో ఉన్న ట్రెజరీ కార్యాలయాల్లోని సీనియర్ అకౌంటెంట్లు పరిశీలించేవారు. వారి తర్వాత సబ్ ట్రెజరీ అధికారులు (ఎస్టీవోలు), ఆ తర్వాత సహాయ జిల్లా ట్రెజరీ అధికారు లు (ఏటీవోలు), అనంతరం సహాయ డైరెక్టర్లు (ఏడీ)లు వరుసగా పరిశీలించి అన్నీ సక్ర

మంగా ఉన్నాయని నిర్ధారించాక రిజర్వ్ బ్యాంకుకు నేరుగా పంపించేవారు. అక్కడి నుంచి ఉద్యోగుల బ్యాంకు ఖాతాలలో నేరుగా జీతాలు చెల్లించేవారు. ఇప్పటివరకు ఈ విధానమే అమలవుతూ వచ్చింది. ఈ ప్రక్రియ అంతా కాగితరహితమే అయినప్పటికీ ఉద్యోగుల పాత్ర ఎంతో ఉంది. దీనిని కూడా మార్పు చేసి కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. ఇంతవరకు ఉన్న ఈ విధానం ఇకపై ట్రెజరీ కార్యాలయాల్లో ముగిసిన అధ్యాయంగా మారనున్నది. ఉద్యోగుల జీతాలకు సంబంధించి ఉన్న సీఎఫ్ఎంఎస్ విధానం అమలులో ఉన్నప్పటికీ దీనిని మరింత విస్తరించి సీఎఫ్ఎంఎస్ ఫేజ్-2ను

అమలు లోకి తెచ్చారు. అందువల్ల ఉద్యోగుల జీతాల తయారు చేయడం, చెల్లించడం వంటి పనులు మరింత సులభతరం అవుతుంది. ఉద్యోగుల ప్రమేయం లేకుండానే ఈ ప్రక్రియ జరిగిపోతుంది.

## హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ అమలు

- రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలందించే విధానాన్ని మార్పు చేసింది. ఈ మార్పులను అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు అమలు చేసేందుకు నిర్ణయించింది. ఈ విధానాన్ని దశలవారీగా అమలు జరుపుతారు.
- సీఎఫ్ఎంఎస్ రెండో దశను ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మొదటి దశలో ఉన్న పొరపాట్లు, ఇతర ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టింది.
- హ్యూమన్ క్యాపిటల్ మేనేజిమెంట్ (హెచ్‌సీఎం) విధానాన్ని అన్ని ట్రెజరీ కార్యాలయాల్లో అమలు చేసేందుకు సదుపాయాలను సమకూర్చింది.
- ఆర్థిక శాఖ పరిధిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బీమా (ఏపీజీఎల్ఐ) స్టేట్ ఆడిట్, పే అండ్ అకౌంట్స్ విభాగాలలో ఈనెల నుంచే ఈ విధానంలో జీతాలను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించింది
- మిగిలిన శాఖల్లో కొత్త ఆర్థిక సంవత్సరంలో.. అంటే మార్చి తర్వాత అమలు చేసేందుకు ఏర్పాట్లు చేసింది.
- ట్రెజరీ కార్యాలయాలల్లో పనిచేసే ఉద్యోగులకు ఈ విధానంలో జీతాలు అందించాక మిగిలిన ఇతర శాఖలకు విస్తరిస్తారు.
- ఉద్యోగుల సేవా పుస్తకాలను కంప్యూటరీకరించడం వల్ల అందులో ఉన్న వివరాలన్నీ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో కూడా ఉంటాయి. ప్రతినెలా వారికి రావాల్సిన పరిహారాలు ఆటోమెటిక్‌గా జనరేట్ అవుతుంటాయి.
- తయారుచేసిన సాఫ్ట్‌వేర్ ఆధారంగా ఉద్యోగుల జీతాలే కాకుండా వారికి సంబంధించిన సమస్త ఆర్థిక వ్యవహారాలు అంటే ఇంక్రిమెంట్లు, ఎన్‌క్యాష్‌మెంట్ లీవులు వంటివన్నీ ఏ నెలకా నెల నమోదవుతుంటాయి.
- ఉద్యోగులకు ప్రభుత్వం కేటాయించిన ట్రెజరీ ఐడీ ఈ ఎస్ఆర్‌కు అనుసంధానం చేయడం వల్ల ఈ నంబర్ ఆధారంగా నెలవారి జీతం అనే ఆప్షన్‌ను క్లిక్ చేస్తే జీతం, డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర కటింగ్‌లన్నీ కలిపి నికర

# ఇవీ ప్రయోజనాలు..

కొత్తగా అమలు జరుగుతున్న కొత్త జీతాల విధానం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది.

- ప్రతినెలా ఒకటో తేదీ నాడే అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలు కచ్చితంగా అందుతాయి.
- ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సక్రమంగా కార్యకలాపాలు జరుగుతాయి.
- తమకు ఇంక్రిమెంట్లు కావాలి, తమ జీతాలు పెంచాలని ఉద్యోగులు కోరుకునే పరిస్థితి ఉండదు. ప్రభుత్వం కరువు భత్యం పెంచిన తక్షణమే ఆ మొత్తం ఉద్యోగుల ఖాతాలలో జమ అవుతుంది.
- ఇంతవరకు ట్రెజరీ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లను, ఏటీవోలను, ఇతర సిబ్బందిని ప్రసన్నం చేసుకునేందుకు ఉద్యోగులు నానాపాట్లు పడేవారు. ఇకపై ఆ పరిస్థితి ఉండదు.
- అధికారులకు లంచాలు అందించే ప్రకియకు ఏమాత్రం అవకాశం ఉండదు. అదనపు ఎరియర్లు వచ్చినా ట్రెజరీ సిబ్బందితో సంబంధం లేకుండా నేరుగా ఉద్యోగుల బ్యాంకు ఖాతాలలో జమ అవుతుంటాయి.
- హెచ్‌సీఎంలో ఎవరి ప్రమేయం లేకుండా ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలన్నీ ఆటోమెటిక్‌గా నమోదవుతాయి.
- ఉద్యోగుల జీతాల వ్యవహారంలో అవినీతి అక్రమాలకు తావులేకుండా నీతివంతమైన విధానం అమల్లోకి వస్తుంది.
- ఈ ఎస్ఆర్‌లో నమోదు చేసిన వివరాల మేరకు అన్ని కార్యక్రమాలు పారదర్శకంగా అమలు జరిగే పరిస్థితి నెలకొంటుంది.

# జీతాల చెల్లింపులో వెసులుబాటు

ఆర్థిక శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన ఈ విధానం వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీతాల చెల్లింపులో ఎంతో వెసులుబాటు ఉంటుందని ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. గతంలో మాదిరిగా ఉద్యోగులు ఇబ్బందిపడే పరిస్థితి ఉండదు. అన్ని మండలాల ఉన్నత పాఠశాలల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎలక్ట్రానిక్ సర్వీస్ రిజిస్టర్లు అందుబాటులోకి వస్తే ఈ విధానం పని తీరు సులభతరమవుతుంది. అధికారులు ఈ-ఎస్ఆర్‌లను తక్షణం చేపట్టే పనులను పూర్తిచేస్తే నూతన పద్ధతిలో ఉద్యోగులకు జీతాలు చెల్లించే అవకాశం కలుగుతుంది.

# చాలా మంచి విధానం

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఉద్యోగుల జీతాల కోసం ప్రవేశపెడుతున్న హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంటు విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. జీతాలను అందించడానికి ఉన్నత పాఠశాలల్లో గజిటెడ్ హెచ్‌ఎం డీడీవోగా వ్యవహరిస్తున్నారు. ఈ విధానం అమల్లోకి వస్తే ఈ డీడీవోల ప్రమేయం లేకుండానే జీతాలు అందుతాయని పలువురు ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మూడు ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు మాత్రమే ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. అన్ని శాఖలకు కూడా తక్షణం అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.